మేడిగడ్డ మరమ్మతులను వెంటనే చేపట్టాలి

- నేషనల్ డ్యామ్ సేఫ్టీ అనుమతులు అవసరం లేదు
- మేడిగడ్డతో సంబంధం లేకుండా నీటిని ఎత్తిపోయాలి
- సాగునీళ్లు ఇవ్వడంలో అడుగడుగునా ప్రభుత్వ వైఫల్యాలు
- సీఎం రేవంత్‌రెడ్డికి మాజీ ఎంపీ వినోద్‌కుమార్ బహిరంగ లేఖ

కరీంనగర్‌లో మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్ కుమార్

కరీంనగర్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మేడిగడ్డ మరమ్మతులను వెంటనే చేపట్టాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాయడంతోపాటు సదరు లేఖను శనివారం కరీంనగర్‌లో విలేకరుల సమావేశంలో విడుదల చేసి మాట్లాడారు. మేడిగడ్డ మరమ్మతులకు నేషనల్ సేఫ్టీ డ్యాం అనుమతులు అవసరం లేదని ఆ చట్టమే చెపుతున్నదన్నారు. ఇకనైనా వెంటనే పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయి రైతులు నష్టపోతున్నారని అవేదన వ్యక్తంచేశారు. మేడిగడ్డతో సంబంధం లేకుండా వెంటనే ప్రాణహిత నుంచి నీటిని ఎత్తిపోసే అవకాశాలున్నాయని, దీనిని సద్వినియోగం చేసుకొని ఎండిపోతున్న పంటలను కాపాడాలని కోరారు.

ప్రభుత్వ వైఫల్యం కాదా?

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఆయకట్టులో యాసంగి పంటకు నీళ్లు ఇవ్వలేమని గత డిసెంబర్‌లో రాష్ట్ర ప్రభుత్వం అధికారులతో ప్రకటన చేయించిందని, తాజాగా రైతు సమితి చైర్మన్ కోదండరెడ్డి పంటలు వేయొద్దని రైతులకు సూచనలు చేస్తున్నారని, ఇదంతా చూస్తుంటే చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా ఉందని వినోద్‌కుమార్ విమర్శించారు. నీళ్లు ఇవ్వలేమని చెప్పడం ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యమే అవుతుందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు లేకపోయినా పంట దిగుబడి సాధించామని మంత్రులు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రకటనలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఒక బ్యారేజీలో నీళ్లు నిల్వ చేయకపోయినా మిగతా ప్రాజెక్టుల ద్వారా రైతులకు నీళ్లు అందుతున్నాయన్న విషయాన్ని మర్చిపోవడం హాస్యాస్పదమని విమర్శించారు.

కేసీఆర్ హయాంలో రికార్డు స్థాయిలో పంటలు

కేసీఆర్ నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం గత పదేండ్లలో రికార్డు స్థాయిలో వరి దిగుబడిని పెంచితే... కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే కనీసం పంటకు నీళ్లు ఇవ్వలేని దుస్థితి తీసుకొచ్చిన మాట వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. ప్రాజెక్టుల పూర్తి బాధ్యత డ్యామ్ ఓనర్‌దేనని ఆ చట్టం స్పష్టంగా చెపుతుంటే.. మరమ్మత్తులు చేయకుండా ప్రభుత్వం బాధ్యతను ఎందుకు విస్మరిస్తున్నదో చెప్పాలని డిమాండ్ చేశారు. చట్టం ప్రకారం రాష్ట్రంలోనూ స్టేట్ డ్యాం సేఫ్టీ అథారిటీ ఉన్నదన్న విషయాన్నే రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. అందులోనూ నిపుణులైన ఇంజినీర్లు ఉన్నారని, కేంద్ర జల సంఘం మాజీ చైర్మన్ ఏబీ పాండ్యా లాంటి నిపుణులు సలహాదారులుగా ఉన్నారని, సూచనలు, సలహాల కోసం మాత్రమే నేషనల్ అథారిటీ ఉన్నదన్న విషయం ముఖ్యమంత్రికి, మంత్రులకు తెలిసి కూడా కాలయాపన చేయడం రైతులను దగా చేయడమేనంటూ మండిపడ్డారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయ లబ్ధి కోసం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీకి లేఖ రాసి ఈ అంశాన్ని రాష్ట్ర పరిధి నుంచి కేంద్ర పరిధిలోకి తీసుకెళ్లారని విమర్శించారు. వారు కోరిన విధంగానే నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ నివేదికను వండి వార్చిన సంగతి తెలిసిందేనని, ఫలితంగా రైతుల పరిస్థితి పెనం నుంచి పొయ్యిలో పడ్డట్టు అయిందని, ఇదంతా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి నిర్వాకమేనని ఎద్దేవాచేశారు. సాగునీటి అధికారులు, స్టేట్ డ్యాం సేఫ్టీ అథారిటీ అధికారులతోచర్చించి.. బ్యారేజీల శాశ్వత మరమ్మతులు పూర్తిచేసి కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకొచ్చి, రానున్న రోజుల్లోనైనా రైతులకు నీళ్లందించే కార్యాచరణకు పూనుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, మాజీ కార్పొరేటర్లు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కేసీఆర్ హయాంలోనే పాలమూరు అభివృద్ధి

- ఐదు కొత్త జిల్లాల ఏర్పాటు
- జిల్లాకో మెడికల్ కళాశాల నిర్మాణం
- రేవంత్ ప్రారంభించిన జిల్లా దవాఖాన, ఠాణాలు కేసీఆర్ కట్టించినవే
- వినియోగంలో ఉన్న ధన్వాడ ఠాణాకు రిబ్బన్ కట్టింగా?
- ప్రజలు చూసి నవ్వుకుంటున్నరు
- అభివృద్ధి మీద, పాలన మీద చర్చిద్దామనడం విడ్డూరం
- మెడికల్ విద్యార్థిని సత్యజ్యోతి ప్రసంగమే సమాధానం
- వక్రీకరణలతో చరిత్రను దాచలేరు
- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఆగ్రహం

మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, పక్కన మాజీ ఎమ్మెల్యేలు ఆనంద్, నరేందర్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి తదితరులు

తెలంగాణ స్వరాష్ట్రంగా అవతరించడం, కొత్త జిల్లాలు ఏర్పడటం వల్లే నారాయణపేటకు మెడికల్ కళాశాల వచ్చింది. తెలంగాణ బిడ్డలకు వైద్యవిద్య అభ్యసించే అవకాశం దక్కింది. రేవంత్ సమక్షంలోనే మెడికల్ విద్యార్థిని సత్యజ్యోతి ఈ విషయం స్పష్టం చేశారు. కేసీఆర్‌తో రేవంత్‌రెడ్డి అభివృద్ధిపై చర్చించాలనడం విడ్డూరం. ఆ చర్చకు నారాయణపేటలోని మెడికల్ కళాశాల, జిల్లా దవాఖాన, కొత్త పోలీస్‌స్టేషన్లు, విద్యార్థిని సత్యజ్యోతే సమాధానం.
- నిరంజన్‌రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): వక్రీకరణలతో చరిత్రను దాచలేరని, సీఎం రేవంత్‌రెడ్డి పదేపదే అబద్ధాలు చెప్పినా వాస్తవాలు మిగిలే ఉంటాయని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి తెలిపారు. నిజాలు ప్రజల అనుభవంలో ఉంటాయని, అబద్ధాలు మాట్లాడినవారిని ప్రజలు ఏవగించుకుంటారని పేర్కొన్నారు. సీఎం వస్తే తమకు మేలు జరుగుతుందని ప్రజలు ఆశిస్తారని, కానీ రేవంత్ ఎక్కడికి వెళ్లినా ఏమీ చేయకపోగా కేసీఆర్ పదేండ్ల పాలనపై విషం చిమ్ముతున్నారని మండిపడ్డారు. తెలంగాణభవన్‌లో శనివారం మాజీ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, పట్నం నరేందర్‌రెడ్డి, బీరం హర్షవర్ధన్‌రెడ్డి, పార్టీ నేతలు శుభప్రదపటేల్, రంగినేని అభిలాశ్, హనుమంతు నాయుడుతో కలిసి మీడియాతో ఆయన మాట్లాడారు. 'కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొత్త జిల్లా నారాయణపేటకే శుక్రవారం రేవంత్ వెళ్లారు. కేసీఆర్ సర్కారు మంజూరు చేసిన కొత్త మెడికల్ కళాశాలను సందర్శించారు. కేసీఆర్ నిర్మించిన జిల్లా దవాఖానను ప్రారంభించారు. రెండు పోలీస్‌స్టేషన్లను కూడా ప్రారంభించారు. అవి కూడా కేసీఆర్ హయాంలోనే పూర్తయ్యాయి. 10 నెలలుగా వినియోగంలో ఉన్న ధన్వాడ పోలీస్‌స్టేషన్‌ను ప్రారంభించడాన్ని చూసి ప్రజలు నవ్వుకుంటున్నరు. ఉమ్మడి పాలమూరును కేసీఆర్ ఐదు జిల్లాలుగా చేసినందుకే ఐదు మెడికల్ కళాశాలలు, దవాఖానలు వచ్చాయి. తద్వారా వేల మంది పిల్లలకు ఎంబీబీఎస్ చదువుకొనే అవకాశం వచ్చింది. కేసీఆర్ ఎంతో చేసిన జిల్లాకు వెళ్లి అభివృద్ధిపై చర్చిద్దామని రేవంత్ మాట్లాడటం హాస్యాస్పదం' అని నిరంజన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు.

సీఎం హుందాగా మాట్లాడాలి

ఉమ్మడి పాలమూరు జిల్లాకు పదేండ్ల కేసీఆర్ పాలనలో అసలు నీళ్లే ఇవ్వలేదని రేవంత్ చెప్తున్నారని, మరి వానకాలంలో 12 లక్షల ఎకరాలు, ఇప్పుడు 6 లక్షల ఎకరాల్లో పంటలు ఎలా సాగవుతున్నాయని నిరంజన్‌రెడ్డి ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చాక పాలమూరు జిల్లాలో కొత్తగా ఒక్క ఎకరాకైనా సాగునీరు ఇచ్చారా? అని రేవంత్‌ను నిలదీశారు. 'కేసీఆర ప్రారంభించిన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి చంద్రబాబు, ఇక్కడి కాంగ్రెస్ నేతలు అనేక అవరోధాలు సృష్టించారు. అయినా వాటన్నింటిని అధిగమించి రూ.34 వేల కోట్లు ఖర్చు చేసి, 5 రిజర్వాయర్లు, 4 పంపింగ్ స్టేషన్లు పూర్తి చేశారు. మూణ్నాలుగు నెలలు సీరియస్‌గా పనిచేసి రూ.1000- 1200 కోట్లు ఖర్చు చేస్తే 12.50 లక్షల ఎకరాలకు నీళ్లొస్తాయి. ఈ 14 నెలల నుంచి పాలమూరు బిడ్డ ఎక్కడికి పోయిండు? 90 శాతం అయిన పనులను ఎందుకు పూర్తి చేయడం లేదు? రేవంత్ స్థానంలో ఎవరున్నా ప్రమాణస్వీకారం చేసిన మరుసటి రోజే దీనిపై దృష్టిసారించేవారు. రైతులు పంటలు వేయొద్దని, బోర్లు వేయొద్దని చెప్పడానికి రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి కావాలా? రైతుబంధు ఎందుకు రాలేదో, రుణమాఫీ ఎందుకు కాలేదో కమిషన్ చెప్పాలి. తెలంగాణ అన్యాయాల మీద మొదటి నుంచి పోరాడుతున్నది బీఆర్‌ఎస్.. మొదటి నుంచి ద్రోహం చేసింది కాంగ్రెస్, టీడీపీ. నిరంతర నిందాపూర్వక ఆరోపణలతో తెలంగాణకు గాని, రేవంత్‌కు గాని ఎలాంటి మేలు జరగదు' అని మండిపడ్డారు.

నేను పాలమూరు బిడ్డను నన్ను కాపాడుకోవాలని అంటున్నావు. దేనికి కాపాడుకోవాలి రేవంత్ రెడ్డి నిన్ను? రుణమాఫీ చేయనందుకా? రైతుభరోసా ఇవ్వనందుకా? నీళ్లు ఇవ్వక, కరెంటు ఇవ్వక పంటలు ఎండబెట్టినందుకా?
- నిరంజన్‌రెడ్డి

శ్రీశైలంలో బ్రహ్మోత్సవాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): శ్రీశైలం మహాక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం ఉదయం శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లకు కాణిపాకం దేవస్థానం తరపున ఈవో పెంచల కిశోర్ దంపతులు.. తిరుమల తిరుపతి దేవస్థానం తరపున ఈవో జే శ్యామలరావు దంపతులు, అధికారులు పట్టు వస్త్రాలను సమర్పించారు. సాయంత్రం పుష్పాలంకృత శోభితులైన శ్రీస్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను మయూర వాహనంపై అధిరోహింపజేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీగిరి వీధుల్లో స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవం కన్నుల పండువగా సాగింది. శివదీక్ష శివ స్వాముల పంచాక్షరి నామస్మరణతో ఆ ప్రాంతం మార్మోగింది.

కేసీఆర్ పాలనలో రివర్స్ మైగ్రేషన్

- పాలమూరు వలసలకు కాంగ్రెస్సే కారణం
- బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ విమర్శలు
- పోతిరెడ్డిపాడుపై ముఖ్యమంత్రి రేవంత్ అబద్ధాలు: పల్లె

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, పక్కన శుభప్రద్, రవికుమార్, కిశోర్‌గౌడ్

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఏర్పడక ముందు వలసల్లో మగ్గిన పాలమూరు ప్రజలు.. కేసీఆర్ పాలనలో సొంతూళ్లకు తిరిగొచ్చారని బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ తెలిపారు. హైదరాబాద్ తెలంగాణభవన్‌లో బీఆర్‌ఎస్ నేతలు శుభప్రద్ పటేల్, పల్లె రవికుమార్, కిశోర్‌గౌడ్‌తో కలిసి శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. అసలు పాలమూరు వలసలకు కాంగ్రెస్ ప్రభుత్వాలే కారణమని విమర్శించారు. తెలంగాణ ఉద్యమంపై తుపాకీ ఎక్కుపెట్టిన రేవంత్‌రెడ్డికి ఉద్యమం గురించి మాట్లాడే అర్హతే లేదని చెప్పారు. రేవంత్‌రెడ్డి మాట ఎవరూ వినడం లేదని ఆరోపించారు. అందుకే మంత్రులు తన కుర్చీపై కన్నేశారని, ఐఏఎస్‌లు సరిగా పనిచేయడం లేదని ఆయనే ఒప్పుకున్నారని చెప్పారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావును చర్చకు రావాలని, తాను ఓడిపోతే ముక్కు నేలకు రాస్తానని రేవంత్‌రెడ్డి సవాల్ విసురుతున్నారని, ఆయన ముక్కు ఊడటం ఖాయమని ఎద్దేవా చేశారు. ఉద్యోగాల కల్పనపై రేవంత్ పచ్చి అబద్ధాలు ఆడుతున్నారని విమర్శించారు. అవినీతి సంపాదనలో రేవంత్‌రెడ్డి మునిగి తేలుతున్నారని ఆరోపించారు. 100 రోజుల్లో గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పి, ఇప్పుడు ఐదేండ్ల సమయం ఉన్నదంటూ తీరిగ్గా చెప్పడం ప్రజలను మోసగించడమేనని ధ్వజమెత్తారు. పోతిరెడ్డిపాడు విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని పల్లె రవికుమార్ విమర్శించారు. పోతిరెడ్డిపాడును వ్యతిరేకిస్తూ వైఎస్ మంత్రి వర్గం నుంచి బీఆర్‌ఎస్ బయటకు వస్తే కాంగ్రెస్ నేతలు పదవులు పట్టుకొని వేలాడరని విమర్శించారు. నల్లగొండ జిల్లాను ఫ్లోరోసిస్ బారిన పడేసిన ఘనత కాంగ్రెస్‌దేనని ధ్వజమెత్తారు. కేసీఆర్‌ను విమర్శించే అర్హత రేవంత్‌రెడ్డికి లేనే లేదని స్పష్టంచేశారు. బీసీ కులగణనపై సీఎం మొండి వాదనలు చేస్తున్నారని మండిపడ్డారు. కులగణన లోపాలపై శాస్త్రీయ ఆధారాలతో మాట్లాడుతుంటే రేవంత్ జీర్ణించులేకపోతున్నారని చెప్పారు.

ప్రొటోకాల్ రగడ.. ఎమ్మెల్యే ఫైర్

ఆసిఫాబాద్ టౌన్, ఫిబ్రవరి 22 : కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రం లోని ప్రేమల గార్డెన్ సమీపంలో శనివారం సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలు అధికారికంగా నిర్వహించారు. ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న వేడుకల్లో తనకు గుర్తింపు ఇవ్వలేదని ఎమ్మెల్యే కోవలక్ష్మి ఫైర్ అయ్యారు. ఫ్లెక్సీలో సైతం తన ఫొటో లేదని, కేవలం కాంగ్రెస్ నాయకుల ఫొటోలను ఏర్పాటు చేయడం ఏమిటని ప్రశ్నించారు. దీంతో సభలో గందరగోళం నెలకొంది. అధికారులు, నిర్వాహకులు ఎమ్మెల్యే కోవ లక్ష్మికి క్షమాపణ చెప్పి సర్ది చెప్పే ప్రయత్నం చేయగా ఆమె సభను వాకౌట్ చేసి వెళ్లిపోయారు.

కాంగ్రెస్ కులగణనతో బీసీలకే ప్రమాదం

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

బోధన్/వినాయక్‌నగర్, ఫిబ్రవరి 22: రేవంత్ సర్కారు చేపట్టిన కులగణనతో బీసీల భవిష్యత్తు అంధకారంగా మారే ప్రమాదం ఉన్నదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. కులగణనపై చర్చకు రావాలన్న సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ హాస్యాస్పదమని అన్నారు. చర్చల కంటే ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఆయన నిజామాబాద్ జిల్లాకు వచ్చిన సందర్భంగా మీడియాతో మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ.. 400 రోజులు గడుస్తున్నా అమలు చేయలేదని విమర్శించారు. రిజర్వేషన్ల పేరుతో కాంగ్రెస్ బీసీలకు తీవ్ర అన్యాయం చేస్తున్నదని, బీసీలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. వివిధ వర్గాలను కాంగ్రెస్ మోసం చేసిందని దుయ్యబట్టారు. నిరుద్యోగులకు అండగా ఉంటామని చెప్పి అధికారంలోకి రాగానే రాహుల్‌గాంధీ ముఖం చాటేశారని విమర్శించారు.

మాకెందుకీ శిక్ష? మేమేం నేరం చేసినం?

- 50 ఏండ్ల కింద మా అత్తమామలు భూమి కొన్నరు
- పీవోటీ ప్రకారమే పేరు మార్పిడి జరిగింది
- మాది తప్పయితే అధికారులెందుకు చేసింద్రు
- అబ్బాడి ఇంటిపేరుంటే జైలుకు పంపుతరా?
- రాజిరెడ్డి కుటుంబ సభ్యుల ఆవేదన

రాజిరెడ్డిని విడుదల చేయాలని వేడుకుంటున్న భార్య లత, కూతుళ్లు లావణ్య, రమ్య

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ)/ఎల్లారెడ్డిపేట: 'యాభై ఏండ్ల కింద అత్తమామలు భూమి కొంటే మాకెందుకీ శిక్ష. ఎలాంటి నోటీసులివ్వకుండా మేమేదో ఘోరమైన నేరం చేసినట్టు నా భర్తను జైలుకు పంపడం ఎంతవరకు న్యాయం? అని రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం జిల్లెలకు చెందిన అబ్బాడి రాజిరెడ్డి భార్య లత కన్నీటి పర్యంతమైంది. రాజిరెడ్డిని జైలుకు పంపిన ఘటనపై ఆయన భార్య లత, కుమార్తెలు లావణ్య, రమ్య తెలిపిన వివరాలు ఇలా..

2017లోనే పేరు మార్పిడి పట్టా..

తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన అబ్బాడి నారాయణరెడ్డి, బాలవ్వ దంపతులకు అదే గ్రామంలో సర్వే నంబర్ 1173/1లో మూడెకరాలు పట్టాభూమి ఉన్నది. వ్యవసాయమే జీవనాధారం. తమ పొలానికి ఆనుకుని ఉన్న 30 గుంటల వ్యవసాయ భూమి (సర్వేనంబర్ 1183/4/1/1)ని దంతె మల్లయ్య అనే రైతు వద్ద యాభై ఏండ్ల క్రితం కొనుగోలు చేసి సాగు చేసుకుంటున్నారు. కొన్ని భూమిని తమ పేరు మీదకు మార్పిడి చేసుకోకుండానే సాగు చేసుకుంటూ వచ్చారు. కొన్నేండ్ల క్రితమే అనారోగ్యంతో నారాయణరెడ్డి, బాలవ్వ దంపతులు మృతి చెందారు. వారి కొడుకు అబ్బాడి రాజిరెడ్డి వారసత్వంగా సక్రమించిన భూమిని సాగు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. తల్లిదండ్రులు కొనుగోలు చేసిన 30 గుంటల భూమిని తన పేరుమీద మార్చుకునేందుకు 2017లో పీవోటీ, సాదాబైనామా చట్టం ప్రకారం అప్పటి ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. వీరికి భూమి అమ్మిన దంతె మల్లయ్య, అతని కొడుకు నర్సయ్య చనిపోవడంతో కోడలు వచ్చి రాజిరెడ్డి పేరుమీదకు భూమి మార్పిడి చేసేందుకు తనకు ఎలాంటి అభ్యంతరం లేదని తహసీల్దార్ ముందు చెప్పడంతో అధికారులు రాజిరెడ్డి పేరుమీద మార్చి, పట్టాదారు పాసుబుక్కు అందించారు. 2017లో పేరు మార్పిడి చేసుకున్న రాజిరెడ్డి అప్పటినుంచి 3 ఎకరాల 30 గుంటల భూమిలో బోర్లు వేసుకుని సాగు చేసుకుంటూ వస్తున్నాడు.

భూమి కబ్జా చెయ్యలేదు..

మాకు రాజకీయాలతో ఎలాంటి సంబంధం లేదు. ఉన్న భూమిలో కాస్తు చేసుకుంటూ బతుకుతున్నం. గుంట భూమి కూడా మేము కబ్జా చెయ్యలే. వారసత్వంగా వచ్చిన దాంట్లోనే సాగు చేసుకుంటున్నం. మా ఆయన పొలం కాడ ఉంటే పోలీసులు వచ్చి తీసుకపోయింద్రు. ఏ తప్పు చెయ్యని నా భర్తను అన్యాయంగా అరెస్టు చేసి జైలుకు పంపింద్రు. నా భర్త గొంతు సమస్యతో ఇబ్బంది పడుతుంటే 12 రోజుల కిందట ఆపరేషన్ చేయించినం. డాక్టర్ రాగి జావ తాగుమన్నడు, టైంకు గోలీలు వేసుకోవాలన్నడు. మాట్లాడితే ప్రాబ్లమైతదని చెప్పిండు. పేషంట్‌గా ఉన్న నా భర్తకు ఏమన్నయితే ఎవలు బాధ్యులు. ఇంటి పేరు అబ్బాడి అని ఉంటే తప్పు చేసినట్లా?
- అబ్బాడి లత (రాజిరెడ్డి భార్య)

మున్నూరుకాపుల్లో ఐక్యత రావాలి

- కులగణనలో మున్నూరుకాపులకు తీవ్ర అన్యాయం జరిగింది
- 5,000 కోట్లతో కార్పొరేషన్ ఏర్పాటుచేయాలి
- మున్నూరుకాపు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర
- మున్నూరుకాపులపై అణచివేత: కే లక్ష్మణ్
- మార్చిలో ఆత్మగౌరవసభ పెట్టాలని తీర్మానం

మాదాపూర్, ఫిబ్రవరి 22: తెలంగాణ రాష్ట్రంలోని కాపులు, మున్నూరుకాపులు ఐక్యంగా ముందుకు సాగాలని, సమిష్టిగానే హక్కులను సాధించుకోవాలని రాజ్యసభ సభ్యుడు, మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వద్దిరాజు రవిచంద్ర పిలుపునిచ్చారు. హైదరాబాద్ మియాపూర్‌లోని సత్యభారతి కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం జరిగిన కాపు, మున్నూరుకాపు ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.5,000 కోట్లతో కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దీనికోసం ఐక్యవేదికను ఒకటి ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. స్వాతంత్ర్యానంతర కాలంలో దేశాన్ని, రాష్ట్రాన్ని ఎక్కువకాలం ఏలిన కాంగ్రెస్, బీజేపీల బీసీలకు తీరని అన్యాయం చేశాయని విమర్శించారు. ఇన్నేండ్లలో కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ, చట్టసభల్లో రిజర్వేషన్లు లేకపోవడం బాధాకరమని తెలిపారు. బీజేపీ ఎంపీ కే లక్ష్మణ్ మాట్లాడుతూ తెలంగాణలో మున్నూరుకాపుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అణచివేత ధోరణి అవలంబిస్తున్నదని ఆరోపించారు. దానిలో భాగంగానే బీసీ జాబితాలో మున్నూరుకాపులను తక్కువ చూపించారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కులగణనలో మున్నూరుకాపులకు జరిగిన అన్యాయంపై సమిష్టిగా పోరాడాలని, మార్చి నెలాఖరులో హైదరాబాదులో ఆత్మగౌరవసభను నిర్వహించాలని, కాపులకు, మున్నూరుకాపులకు రాజకీయ, సామాజికపరంగా ఎలాంటి ఇబ్బందులు కలిగినా సమైక్యంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని కోరుతూ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, తమిళనాడు ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి రామ్మోహన్‌రావు, ప్రతినిధులు ముత్యాల రామదాస్, లక్ష్మీకాంతం, విఠల్, తెలంగాణ విఠల్, బండి పద్మ, మహేందర్‌కుమార్ పటేల్, బాపట్ల మురళి, దాదె వెంకట్, మీసాల చంద్రయ్య, అరవ రామకృష్ణ, మరికలపోతు సుధీర్, సమ్మెట ప్రసాద్, బాలా శ్రీనివాస పటేల్, నేతిమంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

కల్వకుర్తిలో చికెన్ మేళా



నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని బొక్కలకుంట రోడ్డులో శనివారం పౌల్ట్రీ సంఘం ఆధ్వర్యంలో చికెన్ మేళా నిర్వహించారు. 70 డిగ్రీల సెల్సియస్ వద్ద వేడి చేస్తే బర్డ్‌ఫ్లూ నశిస్తుందని నిర్వాహకులు తెలిపారు. చికెన్‌తో రకరకాల వంటకాలను వండి అందరికీ వడ్డించారు. ఉడికించిన 2 వేల గుడ్లను అందజేశారు. - కల్వకుర్తి

ఎమ్మెల్సీ అభ్యర్థికి త్రుటిలో తప్పిన ప్రమాదం

- కోరుట్లలో కారును ఢీకొన్న లారీ
- స్వల్ప గాయాలతో బయటపడ్డ శేఖర్‌రావు

కోరుట్ల, ఫిబ్రవరి 22: పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర్య అభ్యర్థి యాదగిరి శేఖర్‌రావుకు త్రుటిలో ప్రమాదం తప్పింది. శనివారం నిజామాబాద్, బోధన్, ఆర్మూర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించుకుని కరీంనగర్ వైపు వెళ్తున్న ఆయన కారును జగిత్యాల జిల్లా కోరుట్ల సమీపంలోని పూల్‌వాగు బ్రిడ్జిపై లారీ ఢీకొన్నది. ప్రమాదంలో శేఖర్‌రావు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ప్రాథమిక చికిత్స తీసుకున్న శేఖర్‌రావు మరో కారులో కరీంనగర్ వెళ్లారు. లారీ అతివేగంగా వచ్చి కారును ఢీకొట్టడంతో ప్రమాదం జరిగినట్టు ఆయనతో పాటు కారులో ప్రయాణిస్తున్న వారు తెలిపారు. లారీ డ్రైవర్‌పై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు పేర్కొన్నారు. కోరుట్ల ట్రస్మా ప్రతినిధులు శేఖర్‌రావును పరామర్శించి క్షేమ సమాచారాలు తెలుసుకున్నారు.

ఇసుక క్వారీల నిర్వహణకు టెండర్ల ఆహ్వానం

- 28 వరకు గడువిచ్చిన టీజీఎండీసీ

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): క్వారీల్లో ఇసుక తవ్వకం, లారీల్లో లోడింగ్, స్టాక్‌యార్డుల వరకు రవాణా, స్టాక్‌యార్డుల నిర్వహణ తదితర పనులతోపాటు ఇసుక తవ్వకానికి అవసరమైన ఎక్స్‌కవేటర్లు, ఇసుక రవాణా కోసం టిప్పర్లను సమకూర్చేందుకు టీజీఎండీసీ ఆసక్తి వ్యక్తీకరణ టెండర్లను ఆహ్వానించింది. టెండర్ల దాఖలుకు ఈ నెల 28 వరకు గడువు ఇచ్చిన టీజీఎండీసీ.. అర్హతల ఆధారంగా మార్చి 1న ఏజెన్సీలను ఎంపిక చేయనున్నది. కాగా, అధికారులు సృష్టించిన కృత్రిమ కొరతతో హైదరాబాద్‌లో ఇసుక ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. రాష్ట్రంలో గత కొంతకాలంగా ఇసుక తవ్వకం, స్టాక్‌యార్డుల వరకు రవాణా, లోడింగ్ తదితర పనులను కాంట్రాక్టర్లు నిర్వహిస్తున్నారు. చాలా క్వారీల్లో కాంట్రాక్టర్ల గడువు ఇదివరకే ముగిసిపోయింది. అయినప్పటికీ కాంట్రాక్టర్లు, టీజీఎండీసీ అధికారులు కుమ్మక్కై ఇష్టారాజ్యంగా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతుండడంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతున్నది. మరోవైపు వినియోగదారులకు సకాలంలో సరసమైన ధరకు ఇసుక సరఫరా జరగడంలేదు. ఈ అక్రమాలకు చెక్ పెట్టడంతోపాటు వివిధ క్వారీల్లో ఇసుక తవ్వకాలు, స్టాక్‌యార్డుల నిర్వహణ పనులు సక్రమంగా జరిగేలా చూసేందుకు టెండర్ల ద్వారా ఏజెన్సీలను ఎంపిక చేయాలని నిర్ణయించినట్టు అధికారులు తెలిపారు.

కృత్రిమ కొరతతో భారీగా పెరిగిన ధర

ప్రస్తుతం రాష్ట్రంలో ఇసుక ధరలు అడ్డూఅదుపూ లేకుండా పెరిగిపోయాయి. అక్రమాల నివారణ పేరుతో అధికారులు చర్యలు ప్రారంభించినప్పటినుంచి బహిరంగ మార్కెట్‌లో ఇసుకకు తీవ్ర కొరత ఏర్పడింది. ఇసుక రవాణాలో 20-30 కేజీల తేడా వచ్చినా పోలీసులు కేసులు నమోదుచేసి, లారీలను సీజ్ చేస్తుండటంతో అనేక మంది యజమానులు తమ లారీలను నిలిపివేశారు. ఫలితంగా టన్ను ఇసుక ధర రూ.1,200 నుంచి రూ.2,200కు చేరింది. దీంతో నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయే పరిస్థితి ఏర్పడింది.

ఇసుక బుకింగ్‌కు ఉబర్ తరహా యాప్

వినియోగదారులే నేరుగా తమకు కావాల్సినంత ఇసుకను బుక్ చేసుకునే వీలుకల్పించేందుకు టీజీఎండీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక యాప్‌ను రూపొందిస్తున్నారు. ఓలా, ఉబర్ తరహాలో ఉండే ఈ యాప్ ద్వారా వినియోగదారులు ఇసుకను బుక్ చేసుకుని, ఆన్‌లైన్‌లో చెల్లింపులు జరిపితే టీజీఎండీసీ వద్ద రిజిస్ట్రేషన్ అయిన వాహనాల ద్వారా సరఫరా చేస్తారు. 1-2 నెలల్లోగా ఈ యాప్ అందుబాటులోకి వస్తుందని అధికారులు తెలిపారు.

అంబట్‌పల్లిలో జేసీబీతో ప్రహరీ కూల్చివేస్తున్న అధికారులతో స్థానికుల వాగ్వాదం

హైడ్రా తరహాలో ప్రహరీ కూల్చివేత

లింగాల, ఫిబ్రవరి 22 : నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలం అంబట్‌పల్లిలోని సర్వేనంబర్ 732లో 5.29 గుంటల భూమి ఉండగా, అక్రమంగా ప్రహరీ నిర్మించారని పోలీసుల బందోబస్తు మధ్య రెవెన్యూ అధికారులు శనివారం కూల్చివేశారు. వారం రోజుల కిందట అధికారులు సర్వే చేసి మార్క్ వేసి గురువారం అక్రమ కట్టడాలను తొలగించడానికి వెళ్లగా, బాధితులు, గ్రామస్తులు అడ్డుకోవడంతో వెనుదిరిగారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తహసీల్దార్ పాండునాయక్, ఎంఆర్‌ఐ సీతారాం శనివారం తెల్లవారుజామున 4 గంటలకు ప్రహరీని కూల్చివేశారు. సమయం ఇవ్వాలని అధికారులకు విన్నవించినా వినకుండా కూలగొట్టారని విండో చైర్మన్ ఆరోపించారు.